సాక్షి అనంతపురం

ఆదివారం । 19 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.26,350

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26,350 పలికాయి.



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

35.8°/ 14.8°

జిల్లా అంతటా శనివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్‌: లేపాక్షి నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాలకు శనివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,987 మంది దరఖాస్తు చేసుకోగా... 5,492 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతపురంలోని శారదా నగరపాలక ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌ బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్‌ కమిషనర్‌ గోవిందునాయక్‌ పరిశీలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్ష సజావుగా జరిగిందని డీఈఓ తెలిపారు.

రేపు ఫిర్యాదుల స్వీకరణ ఉండదు

అనంతపురం అర్బన్‌: కలెక్టరేట్‌లో ఈనెల 20వ తేదీ (సోమవారం) 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని డీఆర్‌ఓ ఎ.మలోల తెలిపారు. ఎస్సీ ఉప వర్గీకరణపై అభిప్రాయాల సేకరణకు ఏకసభ్య కమిషన్‌ విచ్చేస్తున్న నేపథ్యంలో రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అయితే జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లు, మండల కార్యాలయాల్లో యథావిధిగా జరుగుతుందన్నారు. ప్రజలు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రావొద్దని సూచించారు. అర్జీలను డివిజన్‌ లేదా మండల కార్యాలయాల్లో సమర్పించాలని తెలియజేశారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు 'అనంత' బాలికలు



పూర్ణ చంద్రిక చైత్ర లక్ష్య మోహన్‌

అనంతపురం: హర్యానా రాష్ట్రం పంచకులలో ఫిబ్రవరి మూడో తేదీ నుంచి జరగనున్న జాతీయ స్థాయి స్కూల్‌ గేమ్స్‌ బాలికల అండర్‌–17 చాంపియన్‌షిప్‌ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణులు ఇ.పూర్ణ చంద్రిక, లక్ష్య మోహన్‌, చైత్ర ఎంపికయ్యారు. వీరు ఆంధ్రప్రదేశ్‌ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. గుంటూరులో జరిగిన ఏపీ స్కూల్‌ గేమ్స్‌ పోటీల్లో అనంతపురం జట్టు రన్నర్‌గా నిలిచి రెండో స్థానం దక్కించుకుంది. ఈ జట్టు నుంచి ముగ్గురు అనంతపురం జిల్లాకు చెందిన క్రీడాకారిణులకు రాష్ట్ర జట్టులో చోటు లభించింది. ఈ సందర్భంగా క్రీడాకారిణులకు జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ కార్యదర్శి అభినందనలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త పొలంలో అల్లనేరేడు చెట్ల నరికివేత

రాప్తాడు: పుల్లలరేవులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పెద్ద ఓబులేష్‌కు చెందిన 12 అల్లనేరేడు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్ద ఓబులేష్‌కు సర్వే నంబర్‌ 88–3 (న్యూ)లో 2.86 పొలం ఉంది. అందులో రెండేళ్ల క్రితం 200 అల్లనేరేడు మొక్కలు నాటాడు. రాత్రి వేళ ఎవరో 12 అల్ల నేరేడు చెట్లను నరికివేశారు. శనివారం పొలానికి వెళ్లిన పెద్ద ఓబులేష్‌ గమనించి.. ఇది టీడీపీ కార్యకర్తల పనే అయ్యుంటుందన్న అనుమానంతో పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వరి రైతు విలవిల!



బొమ్మనహాళ్‌ వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్న దళారులు

రైతు వద్ద ప్రతి ధాన్యపు గింజనూ మద్దతు ధరతో కొంటామని ప్రగల్భాలు పలికిన కూటమి సర్కార్‌ మాట తప్పింది. ఖరీఫ్‌లో పండించిన వరి ధాన్యం పూర్తి స్థాయిలో కొనలేక చేతులెత్తేసింది. ఫలితంగా అన్నదాతలను దళారులు అందిన కాడికి దోచుకుంటున్నారు.

- ధాన్యం సేకరణ కేంద్రాల మూత
- రైతుల వద్ద మిగిలిపోయిన వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యం
- మరో 15 వేల మెట్రిక్‌ టన్నులు కొంటేనే ప్రయోజనం
- ప్రభుత్వం చొరవ చూపాలని వేడుకోలు


రాయదుర్గం: జిల్లాలో ప్రభుత్వం తొలుత కేవలం 5 వేల మెట్రిక్‌ టన్నుల లక్ష్యంతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. డిమాండ్‌ పెరగడంతో దాన్ని 14 వేల మెట్రిక్‌ టన్నులకు పెంచింది. ఇప్పటి వరకూ 1,245 మంది రైతుల నుంచి 13,912 మెట్రిక్‌ టన్నుల ధాన్యం సేకరించింది. వాస్తవానికి జిల్లా రైతుల వద్ద ఇంకా వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యం ఉండిపోయింది. ఈ క్రమంలో ధాన్యం సేకరణను పెంచాల్సింది పోయి, బహిరంగ మార్కెట్లో ప్రభుత్వ మద్దతు ధర కంటే క్వింటాకు రూ.100 అధికంగా పలుకుతోందనే సాకుతో కొనుగోలు కేంద్రాలను మూత వేశారు.

దళారులపై రైతుల అనాసక్తి..

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో అధిక ధర పలుకుతున్నా ధాన్యం విక్రయానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. దళారులు రూ.100 ఎక్కువగా ఆశ చూపి తూకాల్లో విపరీతంగా మోసాలకు పాల్పడతారని రైతులు చెబుతున్నారు. తమ కష్టాన్ని దళారుల పాలు చేసేందుకు సుముఖంగా లేరు. ప్రభుత్వం ఇంకా 15 వేల మెట్రిక్‌ టన్నులనైనా కొనుగోలు చేస్తేనే మేలు జరుగుతుందంటున్నారు. కలెక్టర్‌ స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లక్ష మెట్రిక్‌ టన్నులు దళారుల పాలు!

మొదట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులోనూ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. రైతుల నుంచి ఒత్తిళ్లు, ప్రతిపక్షాల డిమాండ్లు ఎక్కువ కావడంతో చేసేది లేక కేంద్రాలు ప్రారంభించింది. అయితే, అన్నదాతలు అప్పటికే సగం ధాన్యాన్ని దళారులకు అమ్ముకున్నారు. ఒకవేళ ప్రభుత్వం ఇప్పటికిప్పుడు మరో 15 వేల మెట్రిక్‌ టన్నుల కొనుగోలుకు అనుమతులిచ్చినా... సుమారు లక్ష మెట్రిక్‌ టన్నుల ధాన్యం దళారుల పాలు కానుంది.



కొనుగోలు కేంద్రాలు కొనసాగించాలి



ఆరు ఎకరాల్లో సాగు చేసిన వరి పంటను ఇటీవల నూర్పిడి చేసి ధాన్యం నిల్వ ఉంచా. నాలాగే చాలా మంది రైతుల వద్ద ఇంకా వేల టన్నుల ధాన్యం మిగిలి ఉంది. ఇలాంటి సమయంలో కొనుగోలు కేంద్రాలను మూసివేయడం సరికాదు. అన్నదాతల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను మరిన్ని రోజులు కొనసాగించాలి. – రవి, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్‌ మండలం



కణేకల్లు వద్ద వరి ధాన్యం కుప్పచేస్తున్న రైతు

అదనంగా సేకరణకు ప్రతిపాదనలు

వరి ధాన్యాన్ని అదనంగా సేకరించడానికి అనుమతులు ఇవ్వాలని కలెక్టర్‌ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేలా కృషి చేస్తాం. ఇప్పటికే లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు చేశాం. ప్రస్తుతం బయట మార్కెట్లో ధర ఎక్కువగా ఉంది. రైతులు అటువైపే మొగ్గు చూపడంతో కొనుగోలు కేంద్రాలను మూసి వేయాల్సి వచ్చింది.

– రమేష్‌రెడ్డి, సివిల్‌ సప్లయీస్‌ డీఎం

ముగిసిన రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు

- మూడో స్థానంలో అనంతపురం



బంతి కోసం గాలిలో ఎగురుతున్న క్రీడాకారుడు

పొదిలి రూరల్‌: స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న 28వ రాష్ట్ర స్థాయి జూనియర్‌ సెపక్‌తక్రా ఛాంపియన్‌ షిప్‌ పోటీలు శనివారం ముగిశాయి. పోటీలకు వివిధ జిల్లాల నుంచి 32 బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగం ఫైనల్‌ మ్యాచ్‌లో ప్రకాశం–కర్నూలు జట్లు నువ్వా–నేనా అన్న విధంగా తలపడ్డాయి. ఈ పోరులో ప్రకాశం జట్టు విజయం సాధించింది. మొదటి బహుమతి ప్రకాశం జట్టు, రెండో బహుమతి కర్నూలు జట్టు సొంతం చేసుకున్నాయి. మూడో బహుమతికి అనంతపురం, ఈస్టుగోదావరి జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించారు. బాలికల విభాగంలో మొదటి బహుమతి తూర్పుగోదావరి జట్టు కైవసం చేసుకోగా, రెండో బహుమతిని ప్రకాశం జిల్లా జట్టు సొంతం చేసుకుంది. మూడో బహుమతికి విజయనగరం, అనంతపురం జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. అనంతరం విజేతలకు సీఐ వెంకటేశ్వర్లు చేతుల మీదగా బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా వైస్‌ ప్రెసిడెంట్‌ జీ శ్రీనివాసులు, అమరనాథ్, మధు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అనంతపురం క్రైం: సాధారణ చార్జీలతోనే ప్రధాన పట్టణాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్‌ ఆర్‌ ఆదోని తెలిపారు. సెలవులు ముగించుకుని అనంతపురం నుంచి వివిధ నగరాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఈ నెల 19 నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ, తిరుపతికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. విజయవాడ, చెన్నై నగరాలకు ఇంద్ర బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలే అజెండా

- పార్టీని మరింత బలోపేతం చేద్దాం
- ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్‌ గిరిజమ్మ, పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలు విశ్వ, రంగయ్య, పెద్దారెడ్డి, మెట్టు, వీరా తదితరులు

అనంతపురం ఎడ్యుకేషన్‌: 'అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే కూటమి ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై గ్రామ స్థాయి నుంచి పోరాటాలకు శ్రీకారం చుడదాం. ప్రజా సమస్యలే అజెండాగా ఉద్యమాలు చేద్దాం' అని వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలు విశ్వేశ్వరరెడ్డి, తలారి రంగయ్య, మెట్టు గోవిందరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వీరాంజనేయులు, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్‌ గిరిజమ్మ, పంచాయతీ రాజ్‌ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డితో పాటు పార్టీ కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు హాజరయ్యారు. ముందుగా దివంగత నేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. త్వరలోనే నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంతో పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పార్టీ కార్యాలయాలు అందుబాటులోకి తెస్తామన్నారు. సమన్వయకర్తలు, జిల్లా కమిటీ నాయకులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా మన పార్టీ ఆఫీస్‌ గుర్తుకు రావాలని, అక్కడికి వెళ్తే సమస్య పరిష్కారమవుతుందన్న భరోసా కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటినుంచే సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో రెవెన్యూ, పోలీసు వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, కలెక్టర్, ఎస్పీ ఆదేశాలకంటే ఎమ్మెల్యేల ఆదేశాల అమలుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. హామీల అమలులో ముఖ్యమంత్రి చంద్రబాబు విఫలమయ్యారని దుయ్యబట్టారు. అప్పులు చేసి మరీ అమరావతిలో ఖర్చు చేయాలని చూస్తున్నారని ఆక్షేపించారు. విశాఖ స్టీల్‌ ప్లాంట్‌ ప్రైవేటీకరణ చేయొద్దంటూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీర్మానం చేసిందని, వైఎస్‌ జగన్‌ కృషి వల్లే విశాఖ స్టీల్‌ ప్లాంట్‌కు రూ.11,500 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఇప్పటికీ స్టీల్‌ ప్లాంట్‌పై ప్రైవేటీకరణ కత్తి వేలాడుతోందన్నారు.

ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. హామీలను నెరవేర్చడంలో విఫలమైన చంద్రబాబు డైవర్షన్‌ పాలిటిక్స్‌ చేస్తున్నారని విమర్శించారు. తిరుమల లడ్డూ వివాదం, ఏకాదశి రోజు జరిగిన ఘటనలు, విద్యుత్‌ కొనుగోలు ఒప్పందాలపై వాళ్ల చేసిన ఆరోపణలు తిరిగి వాళ్లకే తగులుతున్న పరిస్థితి నెలకొందన్నారు. టీడీపీకి వంత పాడే పత్రికలు, వారి మేధావులు కూడా చంద్రబాబు పార్టీని మరో పార్టీ మింగేస్తోందనే భయాన్ని బహిరంగంగానే వెల్లడిస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను దీటుగా ఎదుర్కొనేందుకు సమాయత్తమవుదామని పిలుపునిచ్చారు.

శ్రేణులకు సముచిత గౌరవం

మాజీ ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపడానికి, సముచితమైన గౌరవం ఇవ్వడానికి జిల్లా కమిటీ ప్రయత్నం చేస్తుందన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ప్రజల ఇబ్బందులపై గొంతుక వినిపించేందుకు శ్రేణులను సమాయత్తం చేస్తామని పేర్కొన్నారు. తాడిపత్రి, రాయదుర్గం, శింగనమల సమన్వయకర్తలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, వీరాంజనేయులు, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్‌ గిరిజమ్మ, పంచాయతీ రాజ్‌ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అందరూ అండగా ఉంటామన్నారు. తక్కిన కమిటీలను ఏర్పాటు చేసి గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. ప్రభుత్వ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు.

రుణాల లక్ష్యం అధిగమించాలి

- కలెక్టర్‌ వినోద్‌కుమార్‌



మాట్లాడుతున్న కలెక్టర్‌ వినోద్‌కుమార్‌

అనంతపురం అర్బన్‌: 'కాపు యాక్షన్‌ ప్లాన్‌'కు సంబంధించి స్వయం ఉపాధి పథకం కింద బ్యాంకులకు కేటాయించిన రుణ మంజూరు లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్‌ వి.వినోద్‌కుమార్‌ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌ హాలులో జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 344 యూనిట్లకు రూ.11.55 కోట్లు మంజూరయ్యాయన్నారు. జిల్లాలోని 13 బ్యాంకుల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. రూ. 2 లక్షల యూనిట్‌ విలువ కలిగిన 77 యూనిట్లు, రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల యూనిట్‌ విలువ కలిగిన 167 యూనిట్లు, రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల యూనిట్‌ విలువ కలిగిన 100 యూనిట్లు ఉన్నాయన్నారు. రుణ మంజూరు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్‌ ఈడీ సుబ్రహ్మణ్యం, ఎల్‌డీఎం నర్సింగరావు, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, నాబార్డు డీడీఎం అనురాధ, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, డీసీసీబీ సీఈఓ సురేఖరాణి, బ్యాంకర్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణకు చర్యలు

క్షయవ్యాధి నివారణ లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ వినోద్‌కుమార్‌ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌ శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌ హాలులో జిల్లా క్షయవ్యాధి నివారణ కార్యక్రమంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య శ్రేయస్సుకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ముఖ్యంగా క్షయవ్యాధి నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వ్యాధి సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, జిల్లా క్షయ నివారణాధికారి అనుపమజేమ్స్‌ తదితరులు పాల్గొన్నారు.

మూడో శనివారం స్వచ్ఛ దివస్‌

ఉరవకొండ: ఇకపై ప్రతి నెలా మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌' కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్‌ వినోద్‌ కుమార్‌ తెలిపారు. ఉరవకొండ ఎంపీడీఓ, తహసీల్దార్‌ కార్యాలయాల వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. లత్తవరం గ్రామంలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్‌ నాటికి సాలిడ్‌ వేస్ట్‌ ప్రాసెసింగ్‌ సెంటర్, ప్లాస్టిక్‌ వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌ యూనిట్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక క్లాక్‌టవర్‌ సర్కిల్‌ వద్ద పారిశుద్ధ్య కార్మికులు, వైద్యారోగ్య సిబ్బందితో కలిసి మానవ హారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మేజర్‌ పంచాయతీ సర్పంచ్‌ మీనుగ లలితమ్మ, గుంతకల్లు ఆర్‌డీఓ శ్రీనివాస్‌ జిల్లా పరిషత్‌ సీఈఓ రామచంద్రారెడ్డి, బీసీ వెల్ఫేర్‌ డీడీ కుష్బు కొఠారి తదితరులు పాల్గొన్నారు.

'లెక్క' లేని వారిపై లుక్కు

- ఉమ్మడి జిల్లాలో ఏ రికార్డుల్లో లేని వారి సంఖ్య 3.50 లక్షలు
- ఆధార్‌ కార్డుల్లేని చిన్నారులు 1.20 లక్షల మంది ఉన్నట్లు వెల్లడి
- నెలాఖరులోగా వారి ఆధారాలు సేకరించి నమోదుకు కసరత్తు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: 40 లక్షలకు పైగా జనాభా కలిగిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎలాంటి రికార్డుల్లో లేని వారి సంఖ్య మూడున్నర లక్షలు ఉన్నట్టు వెల్లడైంది. రెవెన్యూ, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, డిస్కమ్స్, రవాణా తదితర ఏ శాఖల వద్దా వీరి వివరాలు లేకపోవడం విస్మయ పరుస్తోంది. అసలు ఇంతమంది ఎలాంటి రికార్డుల్లో నమోదు కాకుండా ఉండటం ఆశ్చర్యంగా ఉందని అధికారులే చెబుతున్నారు. ఈ క్రమంలో వారి ఫోన్‌ నంబర్లు, ఇళ్ల తదితర వివరాలను సేకరించి గ్రామ వార్డు సచివాలయాల పరిధిలోకి తీసుకురావాలనే లక్ష్యంగా అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా సంచార జాతుల ప్రజలు ఉన్నారు. వీరు జిల్లాలో ఇళ్లు కట్టుకున్నా బతుకుదెరువు కోసం నెలల తరబడి ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. ఈ క్రమంలో వీరిపై దృష్టి సారించి రేషన్, పెన్షన్‌ తదితర పథకాలు అందుతున్నాయా లేదా పరిశీలించాలని వార్డు, గ్రామ సచివాలయ సిబ్బందిని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఆధార్‌ కార్డులపై అవగాహన లేదు..

ఉమ్మడి జిల్లాలో 1.20 లక్షల మంది ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్‌ కార్డులు లేవని కూడా వెల్లడైంది. స్త్రీ శిశు సంక్షేమశాఖ లెక్కల ప్రకారం ఈ విషయం తెలిసింది. ఈ క్రమంలో గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఆధార్‌ నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి 15 రోజులకోసారి కలెక్టర్లు సమీక్ష చేయాలని ఆదేశాలు వచ్చాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మాత్రమే గతంలో ఆధార్‌ నమోదుకు అవకాశం ఉండేది. కానీ గత ఐదేళ్ల కాలంలో ఆస్పత్రుల్లోనే ఆధార్‌ నమోదుకు ఆ సౌకర్యం కల్పించారు. అయినా, ఇప్పటికీ చాలా మంది తల్లిదండ్రుల్లో తమ పిల్లలకు ఆధార్‌ కార్డులు తీసుకోవాలనే దానిపై అవగాహన లేకపోవడం గమనార్హం. 'ఆధార్‌' లేనిదే ఇప్పుడు ఎలాంటి పథకాలు అందుకునేందుకు అవకాశం లేని పరిస్థితి.

జిల్లాలో ఏ రికార్డుల్లో లేని వారు	2,09,192
ఇప్పటివరకు గుర్తించింది	8,129
ఇంకా గుర్తించాల్సింది	2,01,063
ఆధార్‌ కార్డు లేని చిన్నారులు	7,5287
ఇప్పటివరకూ ఎన్‌రోల్‌ చేసింది	2,539
ఇంకా ఎన్‌రోల్‌ చేయాల్సింది	72,748

త్వరలో అందరికీ ఆధార్‌

ఆధార్‌ నమోదు చేయించాలనే అవగాహన కొంత మంది తల్లిదండ్రులకు లేదు. దీనివల్లే చాలా మందికి కార్డులు లేవు. దీనికోసం ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహిస్తున్నాం. ఆధార్‌ నమోదు కేంద్రాలు పెంచుతున్నాం. ప్రతి ఆస్పత్రిలో బిడ్డ పుట్టిన వెంటనే బర్త్‌ సర్టిఫికెట్‌ ఇస్తారు. ఆ సర్టిఫికెట్‌తో ఆధార్‌ కేంద్రాలకు వెళ్లి వెంటనే నమోదు కావాలి. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తిచేస్తాం.

–డా.వినోద్‌కుమార్, కలెక్టర్‌

క్లుప్తంగా

రేపటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు



ఉచిత పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఉచిత పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్లు, బ్రోచర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 31వ తేదీ వరకు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, శాస్త్రీయ యాజ మాన్య పద్ధతులు, పశు విజ్ఞానంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. పశు పోషకుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, అధికారులు పాల్గొన్నారు.

పశు సంరక్షణే లక్ష్యం

అనంతపురం అగ్రికల్చర్: పశుసంరక్షణ లక్ష్యంగా సోమవారం నుంచి పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి శనివారం తెలిపారు. శిబిరాల నిర్వహణకు సంబంధించి అనంతపురం, ఉరవకొండ డివిజన్ల డీడీలు రమేష్‌రెడ్డి, వెంకటేష్ ఆధ్వర్యంలో షెడ్యూల్ తయారు చేశామన్నారు. ఇప్పటికే అన్ని పశువైద్యశాలలకు అవసరమైన మందులు పంపిణీ చేశామని తెలిపారు. రైతులు, కాపర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన పశునష్ట పరిహార పథకానికి సంబంధించి పెండింగ్ క్లెయిములు కింద రూ.21.84 కోట్లు విడుదలైనట్లు వెల్లడించారు.

డిప్లొమాతో ఉజ్వల భవిత

పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు శిక్షణ ఒక్క డిప్లొమా కోర్సులోనే సాధ్యమవుతుంది. పూర్తిగా ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో కోర్సు రూపకల్పన చేయడమే ఇందుకు కారణం. ఈ కోర్సు రెండు, మూడేళ్లలో పూర్తవుతుంది. కోర్సు పూర్తయ్యేలోపే ఉద్యోగావకాశం లభిస్తుంది. కళాశాల నుంచి నేరుగా కంపెనీకి వెళ్లేలా కోర్సులను తీర్చిదిద్దారు.

- కోర్సు పూర్తయ్యేలోపు కొలువు
- కలిసి వస్తున్న క్యాంపస్ సెలక్షన్లు
- ఆసక్తి చూపుతున్న గ్రామీణ విద్యార్థులు

అనంతపురం: డిప్లొమాతో తక్షణ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతున్నాయి. 18 సంవత్సరాలకే ఐదంకెల వేతనంతో సంపాదన మొదలు పెట్టవచ్చు. కియా లాంటి అంతర్జాతీయ పరిశ్రమలకు సంబంధించిన ప్రత్యేక నైపుణ్య కేంద్రాలను అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం చొరవ కారణంగా ఈ నైపుణ్య కేంద్రం ఏర్పాటైంది. గత ప్రభుత్వం ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేయడంతోనే అవకాశాలు ముంగిట్లో ఉంటున్నాయి. ఇందుకు అనుగుణంగా శిక్షణ ఇస్తుండడంతో సులువుగా అవకాశాలు అందిపుచ్చుకోవడానికి ఆస్కారం ఏర్పడుతోంది. మరోవైపు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సులకు అధిక డిమాండ్ ఏర్పడడానికి క్యాంపస్ కొలువుల్లో గణనీయంగా ఎంపిక కావడమే. ఎన్‌బీఏ (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు గతేడాది వచ్చింది. ఎలక్ట్రికల్, ఈసీఈ, ఆటోమొబైల్స్, సివిల్, మెకానికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులు డిప్లొమా కోర్సుల పట్ల ఆసక్తి చూపుతున్నారు. ప్రతి ఏటా కోర్సులో చేరేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు.



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురం

ప్రత్యేక శిక్షణతో సత్ఫలితాలు

డిప్లొమా చదివే ప్రతి విద్యార్థికీ ఉజ్వల భవిష్యత్తు దక్కేలా చర్యలు తీసుకున్నారు. నిపుణుల సహకారంతో పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా కోర్సును రూపొందించారు. విద్యా సంవత్సరం పూర్తికాగానే ఉద్యోగాలకు ఎంపికయ్యేలా నైపుణ్యాల పెంపుదలకు బాటలు వేశారు. అందులో భాగంగానే అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కియా శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పారు. తద్వారా కోర్సు పూర్తికాగానే విద్యార్థులు సులువుగా కొలువులు సంపాదిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో కోర్సు పూర్తి చేసిన 228 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయి. మొత్తం 250 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 228 మంది రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీకి ఎంపికయ్యారు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో 75, ఆటోమొబైల్ 11, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ 75, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్‌లో 67 మందికి ఉద్యోగాలు వరించాయి. నెలకు రూ.18,500 జీతం, హాజరు బోనస్ రూ.1500, వార్షిక బోనస్ రూ.12 వేలు, ఉచిత రవాణా, ఆహారం అందిస్తారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలపై ప్రత్యేక దృష్టి



కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. డిప్లొమా మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులకు ఇండస్ట్రియల్ ఓరియంటెడ్ శిక్షణ ఇస్తున్నాం. భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందిస్తున్నాం. ఇప్పటికే 228 మందికి కొలువులు దక్కాయి. మరికొన్ని ఫలితాలు రావాల్సి ఉంది.

– డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఈఈఈ విభాగాధిపతి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురం

కలలో కూడా ఊహించలేదు



మాది తాడిపత్రి. నాన్న ఎం.శంకర్, అమ్మ ఎం.రమ. నాన్న సెలూన్ షాపు నిర్వహిస్తున్నాడు. డిప్లొమాలో కోర్ సబ్జెక్టుపై పట్టు సాధించాలి. నైపుణ్యాలు పెంపొందించుకునేలా శిక్షణ ఇచ్చారు. అధ్యాపకులు మాపై ప్రత్యేక శ్రద్ధ వహించి శిక్షణ ఇవ్వడంతో నాకు రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. చెన్నైలో పని చేయాల్సి ఉంది. ఇంత త్వరగా ఉద్యోగం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. సంతోషంగా ఉంది.

– ఎం.రాజేష్, తాడిపత్రి

ఆనందంగా ఉంది



నాది ధర్మవరం. నాన్న పి.రామ్మోహన్ ఆర్టీసీ కండక్టర్. అమ్మ పి.లీలావతి. నేను డిప్లొమా కోర్సు చేశా. ఇంటర్వ్యూలో కారుపైన స్క్రాచ్‌లు వస్తే కస్టమర్‌ను ఎలా కన్విన్స్ చేస్తారనే అంశంపై ప్రశ్నలు అడిగారు. కస్టమర్లతో ఎలా మాట్లాడాలి. నూతన కారును ఎలా డిజైన్ చేయాలనే అంశాల గురించి అడిగారు. బేసిక్స్ అంశాలపై పట్టు సాధించడం వల్ల రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఆనందంగా ఉంది. మరో మూడు కంపెనీలకు కూడా ఇంటర్వ్యూలకు హాజరయ్యాను.

– పి. హరిణి, ధర్మవరం

మాటల్లో చెప్పలేని సంతోషం



మాది అనంతపురం. నాన్న వి.ఆదినారాయణ పెయింటింగ్ కాంట్రాక్టర్, అమ్మ వి.అంజనమ్మ. డిప్లొమా కోర్సు చేసిన నేను బెంగళూరులోని ముసాచి అనే కంపెనీలో ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేశాను. ఆ అనుభవం కలిసొచ్చింది. ఇంటర్వ్యూలో ఏ రకంగా ప్రశ్నలు అడుగుతారనే అంశంపై యూ–ట్యూబ్ ద్వారా నేర్చుకున్నాను. అడ్వాన్స్ టాపిక్స్‌పై దృష్టి పెట్టాను. రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

– వి.విశ్వనాథ ఆచారి, అనంతపురం

డిప్లొమాతో ఉద్యోగావకాశాలు పుష్కలం



డిప్లొమా పూర్తి చేసిన వారికి అద్భుతమైన అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అర్హులైన, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ఉన్నారు. కళాశాలలో అధునాతన సదుపాయాలు ఉన్నాయి. ప్రతి విద్యార్థికీ ఉద్యోగం వచ్చేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

– డాక్టర్ సి.జయచంద్రారెడ్డి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, అనంతపురం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన బాలప్ప

శెట్టూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. చెర్లోపల్లికి చెందిన గొల్ల బాలప్ప (55) వ్యవసాయంతో పాటు పొట్టేళ్ల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం పొట్టేళ్ల మేత కోసం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలోంచి వేపాకు తీసుకుని తలపై పెట్టుకుని నడుచుకుంటూ వస్తున్నాడు. ఇదే సమయంలో కళ్యాణదుర్గం నుంచి లక్ష్మంపల్లి వైపు వస్తున్న కారు రోడ్డుపై వెళ్తున్న బాలప్పను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ రాంభూపాల్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రోడ్డు ప్రమాద విషయం తెలియగానే వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమామహేశ్వర నాయుడు. జెడ్పీటీసీ మంజునాథ, తదితరులు ఆస్పత్రికి వెళ్లి బాలప్ప మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ విరుపాక్షి, నాయకులు పోస్ట్ రామకృష్ణ, ఆదిశేషు, టైలర్ వన్నూరుస్వామి, పాలయ్య, మంజు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మరొకరు...



మృతుడు ఓబులేసు

తాడిపత్రి రూరల్ : పట్టణ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సీపీఐ కాలనీలో నివాసముంటున్న రజకవృత్తిదారుడు ఓబులేసు (26) శుక్రవారం రాత్రి ఎస్‌వీ ఫంక్షన్ హాలులో జరిగే శుభకార్యానికి హాజరయ్యేందుకు ఇంటికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. నంద్యాల రోడ్డులోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓబులేసు అక్కడికక్కడే మృతి చెందాడు. అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ శివగంగాధర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతుపై హత్యాయత్నం

- పొలం రస్తా గొడవే కారణం



తీవ్రంగా గాయపడిన పామాల్ల రామచంద్ర

రాప్తాడు: పొలం వద్దకు వెళ్తున్న రైతుపై పక్క పొలం యజమాని తన కుమారుడితో కలిసి మారణాయుధాలతో హత్యాయత్నం చేశారు. తీవ్రంగా గాయపడిన రైతు పరిస్థితి విషమంగా ఉంది. పొలం రస్తా తగాదాలే ఘటనకు కారణం. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాప్తాడుకు చెందిన పామాల్ల రామచంద్రకు గంగలకుంట పొలం సర్వే నంబర్ 57, 65–2లో 3.15 ఎకరాలతో పాటు రాప్తాడు పొలంలో కూడా కొంత భూమి ఉంది. తన పొలంలోకి వెళ్లాలంటే గ్రామానికి చెందిన పామాల్ల పండయ్య పొలం మీదుగా ఉన్న రస్తానే ఆధారం. ఆరు నెలల క్రితం గ్రామంలో 44వ జాతీయ రహదారి సమీపంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం పక్కనున్న వ్యవసాయ దొడ్డి విషయంలో పండయ్య నకిలీ పట్టాలు సృష్టించి తనకు 11 సెంట్ల స్థలం ఉందని రామచంద్ర, ఆయన సోదరులతో ఘర్షణకు దిగాడు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశాడు. పండయ్య దగ్గర సరైన పత్రాలు లేకపోవడంతో తామేమీ చేయలేమని, మీరే పంచాయితీ చేసుకుని సమస్య పరిష్కరించుకోండని పోలీసులు, రెవెన్యూ అధికారులు సూచించారు. అయితే పండయ్య ఎలాగైనా సదరు స్థలాన్ని తనపరం చేసుకోవడానికి అడ్డుగా ఉన్న రామచంద్ర, అతని సోదరులపై దాడి చేసేందుకు పథకం వేస్తూ వచ్చాడు. ఇదిలా ఉండగా మూడు రోజుల క్రితం రామచంద్ర, రెండు రోజుల క్రితం పండయ్య శివమాల వేశారు. శనివారం ఉదయం ద్విచక్రవాహనంపై రామచంద్ర తన పొలం దగ్గరకు వెళ్తుండగా అప్పటికే పథకం ప్రకారం కాపుకాచిన పండయ్య, అతని కుమారుడు నరేషలు ఇనుపరాడ్ అడ్డు పెట్టారు. దీంతో రామచంద్ర కిందపడిపోయాడు. ఈ రస్తాపై నీవు పొలానికి వెళ్లకూడదంటూ ఇనుప రాడ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. తలకు తీవ్రగాయమై రామచంద్ర స్పృహతప్పి కింద పడిపోయాడు. ఆ రస్తా మీదుగానే ఇంటికెళ్లేందుకు రామచంద్ర సోదరులు వస్తుండడంతో వారిని గమనించిన పండయ్య, నరేషలు ఇద్దరూ ద్విచక్ర వాహనంపై ఉడాయించారు. స్పృహతప్పిన రామచంద్రను సోదరులు వెంటనే అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామచంద్ర పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారని సోదరులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పామిడి: ఖాదర్‌పేటకు చెందిన ఉప్పర భీమునిపల్లి పుల్లయ్య(45) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సీఐ వి.యుగంధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పుల్లయ్య వ్యవసాయంతో పాటు మగ్గం పనిచేస్తూ భార్య, కుమారుడిని పోషించేవాడు. కుమారుడు మనోజ్ అనంతపురంలోనే ఉంటూ ఇంటర్ చదువుతున్నాడు. కుటుంబ కలహాలతో భార్య కళావతి రెండురోజుల క్రితం దేవరపల్లిలోని పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న పుల్లయ్య శనివారం విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న భార్య, ఆమె కుటుంబ సభ్యులు ఖాదర్‌పేటకు వెళ్లారు. వెంటనే పుల్లయ్యను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మృతదేహంపై గాయాలు ఉండడాన్ని వైద్యులు గమనించారు. దీంతో పుల్లయ్యది అనుమానాస్పద మృతి కింద సీఐ కేసు నమోదు చేశారు. మృతికి గల కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

గుండెపోటు వస్తే కాలికి కట్టు కడతారా?

- విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంది జగన్
- చంద్రబాబు ఏ ఒక్కరోజూ పల్లెత్తు మాట మాట్లాడలేదు
- సెయిల్‌లో విలీనం చేస్తేనే ఉక్కు పరిశ్రమకు మనుగడ
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్



మాట్లాడుతున్న గోరంట్ల మాధవ్

అనంతపురం ఎడ్యుకేషన్: 'విశాఖ ఉక్కు పరిశ్రమ అనే పేషెంట్‌కు గుండెపోటు వస్తే.. కాలికి కట్టుకడతామంటోంది కేంద్ర ప్రభుత్వం. కాలికి కట్టుకడితే గుండెపోటు ఎలా తగ్గుతుందో అర్థం కావడం లేదు' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ మండిపడ్డారు. శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకు విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు' నినాదంతో అడ్డుకున్నారన్నారు. తాను సీఎంగా ఉన్నన్ని రోజులూ ప్రైవేటీకరణ జరగదని తేల్చి చెప్పి కేంద్రానికి హెచ్చరికలు పంపారని గుర్తు చేశారు. చంద్రబాబు ఉక్కు పరిశ్రమ గురించి ఏరోజూ మాట్లాడిన సందర్భం లేదన్నారు. ప్రత్యేక హోదా వద్దని ప్యాకేజీ తెచ్చుకున్న చంద్రబాబు.. ఉక్కు పరిశ్రమను సెయిల్‌లో విలీనం చేయకుండా ప్యాకేజీ తెచ్చుకున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.11,500 కోట్లు కేటాయించినంత మాత్రాన ఒరిగేదేమీ లేదన్నారు. ఇప్పటికే రూ.35 వేల కోట్ల బకాయిలున్నాయన్నారు. క్యాపిటివ్ మైన్స్ కూడా లేదన్నారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో ఐసీయూలో ఉన్న పేషెంట్‌కు కొద్దిపాటి ఆక్సిజన్ ఇచ్చి బతికిస్తామంటే ఎలా సాధ్యమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల నుంచి ఐసీయూలో ఉన్న విశాఖ ప్లాంట్‌కు ఈరోజు కొద్దిపాటి ఆక్సిజన్ ఇచ్చి బూటకం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. క్యాపిటివ్ మైన్స్ ఏర్పాటు చేయాలన్నారు. అప్పుడే ఈ ఉక్కు పరిశ్రమకు మనుగడ ఉంటుందన్నారు.

వచ్చే ఏడాది అమలు చేసేందుకు కేబినేట్‌లో తీర్మానాలా?

కేబినెట్‌లో వచ్చే ఏడాది అమలు చేసే సూపర్ సిక్స్ పథకాల గురించి తీర్మానాలు చేయడం సిగ్గుచేటని గోరంట్ల మాధవ్ అన్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన ఏడు నెలల్లోనే రూ. 42 వేల కోట్లను వివిధ పథకాల ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఖాతాల్లో జమ చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు పూర్తవుతున్నా ఒక్కటంటే ఒక్క పథకమూ అమలు చేయలేదన్నారు. ఉచిత సిలిండర్ పథకమూ బూటకమేనన్నారు. పింఛన్ రూ.4 వేలకు పెంచినా లక్షలాదిమంది పింఛన్లకు కోత పెట్టారన్నారు. అన్నం పెట్టిన రైతుకు సున్నం, తల్లికి వందనం పేరుతో తల్లికి పంగనామాలు పెడుతున్నారన్నారు. కల్లబొల్లిమాటలతో కాలయాపన చేయకుండా ఇచ్చిన మాట ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జమిలీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయయాదవ్, నసనకోట ముత్యాలు, కుంటిమద్ది రమేష్, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరగాడు అరెస్ట్



అరెస్ట్ అయిన సాకే శివయ్య

అనంతపురం : ఆరోగ్యశ్రీ విభాగం పేరుతో రోగుల బంధువులకు ఫోన్ చేసి తన ఖాతాకు యూపీఐ పేమెంట్స్ ద్వారా నగదు వేయించుకుంటున్న సైబర్ నేరగాడిని అనంతపురం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీ సత్య సాయి జిల్లా రామగిరి మండలం దుబ్బార్లపల్లికి చెందిన సాకే ఓబులేసు కుమారుడు సాకే శివయ్య బీఈడీ వరకు చదివి బెట్టింగ్, జల్సాలకు అలవాటు పడ్డాడు. సులువుగా డబ్బు సంపాదించడం కోసం రక్తబంధం గ్రూపు ఆర్గనైజేషన్ ట్రస్టు అనే వాట్సాప్ గ్రూపులో జాయిన్ అయి, ఆ గ్రూపులో రక్తం ఎవరికి అవసరం అవుతుందో ఆ సెల్ నంబర్‌కు ఫోన్ చేసి 'నేను ఆరోగ్యశ్రీ విభాగం నుంచి' అని పరిచయం చేసుకుని మీకు ఉచితంగా ట్రీట్‌మెంట్ కావాలంటే కొంత డబ్బు చెల్లించాలని ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా డబ్బులు వేయించుకుని, తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేస్తుండేవాడు. ఈ నెల 13న సర్వజనాస్పత్రి ఆర్థో వార్డు, గైనిక్ వార్డులో ఉన్న ఐదుగురు పేషెంట్లకు ఫోన్ చేసి వారి నుంచి రూ.12 వేలు డిపాజిట్ చేయించుకుని మోసం చేశాడు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు సైబర్ నేరం కింద కేసు నమోదు చేశారు. నిందితుడు సాకే శివయ్యను శనివారం అరెస్ట్ చేశారు. డిసెంబర్ నుంచి ఇప్పటి దాకా మొత్తం 12 మంది అమాయకుల నుంచి రూ.30 వేలు అక్రమంగా డబ్బు వేయించుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నాడు అర్హులు.. నేడు అనర్హులట!

- పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులపై కూటమి సర్కారు నిర్దయ
- ప్రిలిమ్స్‌లోనూ అర్హత సాధించిన అభ్యర్థులు
- కోర్టు కేసు, ఎన్నికలతో అప్పట్లో ఆగిన దేహదారుఢ్య పరీక్షలు
- రెండునెలల క్రితం వాటి ప్రకటన జారీ
- ఇప్పుడు వయసు మీరిందంటూ పలువురిని అనుమతించని అధికారులు
- ఇదేం న్యాయమంటూ అభ్యర్థుల గగ్గోలు



దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొన్న కానిస్టేబుల్ అభ్యర్థులు

అనంతపురం : పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్దయతో వ్యవహరిస్తోంది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన పలువురిని దేహదారుఢ్య పరీక్షలకు అనుమతించకుండా తీరని అన్యాయం చేస్తోంది. రెండేళ్ల క్రితం ఇచ్చిన నోటిఫికేషన్ నాటికి వారు వయసు రీత్యా అర్హులే. కానీ.. కోర్టు కేసు, ఎన్నికల కారణంగా గతంలో దేహదారుఢ్య పరీక్షలు ఆగిపోయాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే ఈవెంట్స్ పెట్టి, నియామకాలు చేపట్టకుండా ఐదు నెలలపాటు కాలయాపన చేసింది. ఇప్పుడు వయసు మీరిపోయిందంటూ అనేకమందిని ఇళ్లకు పంపేస్తోంది. వారు అర్హులైనప్పటికీ, వారి తప్పేమీ లేకపోయినప్పటికీ నిర్దయగా తిరస్కరిస్తోంది. దీంతో అభ్యర్థులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇదేమిటని సెలక్షన్ అధికారులను అడిగితే.. తామేమీ చేయలేమని, ఏదైనా ఉంటే రిక్రూట్‌మెంట్ బోర్డుకు విన్నవించుకోవాలని సూచిస్తున్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 411 ఎస్‌ఐ, 6,100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎస్‌ఐ పోస్టులకు ప్రిలిమ్స్, దేహదారుఢ్య పరీక్షలు పూర్తయ్యాయి. కానిస్టేబుల్ పోస్టులకు 2023 జనవరి 22న ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించారు. తమ సర్వీసును సైతం పరిగణనలోకి తీసుకోవాలని హోంగార్డులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈవెంట్స్ (దేహదారుఢ్య పరీక్షలు)కు బ్రేక్ పడింది. అనంతరం సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదునెలల పాటు ఈ పోస్టుల భర్తీని పట్టించుకోలేదు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులంతా మళ్లీ ఆన్‌లైన్‌లో ఈవెంట్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని రెండు నెలల క్రితం ప్రకటించింది. అప్పట్నుంచి కష్టపడి దేహదారుఢ్య పరీక్షలకు సిద్ధమైన పలువురు అభ్యర్థులను వయసు మీరిందంటూ అనుమతించకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇలా ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే వంద మందికి పైగా అన్యాయానికి గురయ్యారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఇదీ వయసు నిబంధన..

జనరల్, ఓబీసీ అభ్యర్థులకు 18 నుంచి 27 ఏళ్లు

ఎస్సీ, ఎస్టీ కేటగిరీ వారికి 18 నుంచి 32 ఏళ్లు

ఇదెక్కడి న్యాయం?



దేహదారుఢ్య పరీక్షలు జనవరి 17న నిర్వహిస్తున్నట్లు హాల్‌టికెట్ ఇచ్చారు. అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియానికి వెళ్లాక.. 'మీకు వయసు అయిపోయింది. అర్హతలేద'ని చెప్పారు. నోటిఫికేషన్ జారీ సమయానికి వయసును పరిగణనలోకి తీసుకోవాలి గానీ అందుకు విరుద్ధంగా తీసుకుంటున్నారు. ఈ పరీక్షలకు నెలన్నర నుంచి సిద్ధమయ్యాను. తీరా ఇప్పుడు అర్హత లేదనడంతో కానిస్టేబుల్ కల చెదిరిపోతోంది.

– ఎన్. చంద్రశేఖర్, కానిస్టేబుల్ అభ్యర్థి, అనంతపురం

క్లుప్తంగా

పశుశాఖ ఏడీగా డాక్టర్ జి.ఉపేంద్ర



అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా డాక్టర్ జి.ఉపేంద్ర శనివారం బాధ్యతలు తీసుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (వీఏఎస్)గా పని చేస్తున్న ఈయనకు ఇటీవల ఏడీగా పదోన్నతి కల్పించి జిల్లాకు బదిలీ చేశారు. శనివారం ఆయన జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామిని కలిసి జాయినింగ్ రిపోర్టు తీసుకున్నారు. జేడీ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఏడీ స్థానంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అలాగే పశుశాఖ ఉరవకొండ డివిజన్ సూపరెండెంటెంట్ శ్రీనివాసులుకు పదోన్నతి కల్పించి నెల్లూరు జిల్లా పశుశాఖ జేడీ కార్యాలయ మేనేజర్‌గా బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నెలాఖరున రిలీవ్ కానున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ శివ నారాయణ శర్మ

అనంతపురం అర్బన్: ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ శనివారం కలెక్టరేట్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కటిక జయరాం, ప్రధాన కార్యదర్శి రాజరమేష్, గౌరవాధ్యక్షుడు ప్రకాష్‌బాబు, నాయకులు సునీల్ కుమార్, లక్ష్మీనారాయణ, సాయిప్రియ, హృషికేష్, నరసింహులు, ఆంజనేయులు, గంగాధర్, నాగరాజు, శ్రీనివాసులు, మనోహర్, నాగప్ప, ఆదిశేషు, నాగేంద్ర పాల్గొన్నారు.

బస్టాండులో అధిక ధరలకు విక్రయాలు

అనంతపురం క్రైం: అనంతపురం ఆర్టీసీ బస్టాండులో దుకాణదారులు అధిక ధరలకు విక్రయాలు సాగిస్తున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక నేతలు తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం తూనికలు, కొలతల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ వేదిక అధ్యక్షుడు కె.అల్తాఫ్ మాట్లాడుతూ.. అనంతపురం ఆర్టీసీ బస్టాండులో వ్యాపారులు దోపిడీకి తెరతీశారన్నారు. ప్రయాణికుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై ఆర్టీసీ ఆర్ఎం, డిపో మేనేజర్లకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. అనంతరం వారు తూనికలు, కొలతలశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

రాప్తాడురూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా అనంతపురం రూరల్ మండలం కృష్ణంరెడ్డిపల్లిలో ప్రారంభమైన క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. గ్రామస్తుల సహకారంతో ఈ పోటీలు జరిగాయి. ఫైనల్‌లో సి.రాంబాబు, చంద్ర జట్లు తలపడ్డాయి. సి.రాంబాబు జట్టు విజయం సాధించింది. అనంతరం విజేత జట్టు సభ్యులకు బహుమతులు అందజేశారు. టోర్నీ నిర్వహణకు పెరవళి జయచంద్రారెడ్డి, అండ తిరుపాలు, మల్లె తిరుపాలు సహకారం అందించారని నిర్వాహకులు బండి లోకేష్, సాకే రవి తెలిపారు.

మాదిగ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు మాదిగ

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని మాదిగ ఉద్యోగుల సంక్షేమమే మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్)లక్ష్యమని ఆ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు మాదిగ అన్నారు. శనివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నెపాకుల రమేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరుగుతున్న పోరాటాలకు అండగా మాదిగ ఉద్యోగుల సమాఖ్య నిలుస్తుందన్నారు. త్వరలోనే ఎస్సీ వర్గీకరణ సాధించడం ద్వారా మాదిగ ఉపకులాలకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లలో న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణకు ప్రాణత్యాగం చేసిన అమరులు, 30 ఏళ్లుగా ఈ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న కార్యకర్తలకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఫలితం అంకితం అన్నారు. సమావేశంలో ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, జాతీయ కార్యవర్గ సభ్యులు సాకే అమర్‌నాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లప్ప గారి గంగాధర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు రంగయ్య, రవిశంకర్, రాష్ట్ర గౌరవ సలహాదారుడు డాక్టర్ న్యామద్దల నరసింహులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.హనుమంత రావు, ఉలవల నాగరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నగేష్, ప్రధాన కార్యదర్శి అశోక్, అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి పుల్లన్న పాల్గొన్నారు.

నిర్లక్ష్యం.. తీస్తుంది ప్రాణం

- ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు కరువు
- ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



రాప్తాడులోని పంచాయతీ రాజ్ కాలనీలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

రాప్తాడు: మండల కేంద్రంలో జనసంచారం అధికంగా ఉంటుంది. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేవు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు పాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పలుచోట్ల చిన్న పిల్లలకు సైతం అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో ప్రమాదాలు చేసుకునే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు పక్కకు ఒరిగిపోయి ఉన్నాయి. మండలంలో చాలా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయలేదు. మండల కేంద్రంలోనే కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు నాలుగు ఉన్నాయి. ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్, ఇందిరమ్మ కాలనీ, కళాకారుల కాలనీ, ఆడిటర్స్ కాలనీ, పంచాయతీ రాజ్ కాలనీల్లో కూడా దాదాపుగా 15 ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకర స్థితిలో దర్శనమిస్తున్నాయి. ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులతో నిత్యం రద్దీగా ఉంటుంది. అయినా ట్రాన్స్‌కో అధికారులు భద్రతా చర్యలపై ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. ట్రాన్స్ ఫార్మర్ల వద్ద తగిన భద్రత చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు లిఖిత పూర్వకంగా వినతులు అందజేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగితే గానీ పట్టించుకోరా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి మంటలు చెలరేగుతున్నాయి.. ఎప్పుడు ఎక్కడ పేలిపోతాయో అని హడలిపోతున్నారు. పిల్లలు ఆడుకుంటూ వెళ్లి వాటిని ముట్టుకుంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అనేకచోట్ల మూడు అడుగుల ఎత్తులోనే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వాస్తవానికి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో నిబంధనలు పాటించాల్సి ఉంది. 11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మూడు అడుగుల దూరంలో జనం నడిచేలా ఏర్పాటు చేయాలి. ఎల్‌టిలైన్‌కు ఐదు మీటర్ల దూరంలో వాహనాలు రాకపోకలు సాగించాలి. కానీ ఈ నిబంధనలు ఏవీ అమలు కావడం లేదు. ట్రాన్స్‌కో అధికారులు ఇప్పటికైనా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తులో ఏర్పాటు చేసి, వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?



మా కాలనీలో మూడు అడుగుల ఎత్తులోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. నిత్యం చిన్న పిల్లలు తిరుగుతూ ఉంటారు. ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ దిశగా ట్రాన్స్‌కో అధికారులు ఏ మాత్రం పని చేయడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ కూడా నాలుగు అడుగుల రస్తాలోనే ఉంది. కొద్దిగా లోపలికి జరిపితే ప్రమాదాలు జరగవు.

– కృష్ణవేణి, ఇందిరమ్మ కాలనీ

భయమేస్తోంది



రాప్తాడులో ట్రాన్స్‌ఫార్మర్లను చూస్తే భయం వేస్తోంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం ముందు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ఎప్పుడు ఎక్కడా ఎలాంటి ప్రమాదం జరుగుతుందో ఆందోళనగా ఉంది. అధికారులు వెంటనే అన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు ఎత్తును పెంచి, చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఏముంది.

– ఓం ప్రకాష్, రాప్తాడు

కంచెలు ఏర్పాటు చేస్తాం

మండలంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో అక్కడక్కడ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేస్తున్నాం. ఇళ్ల దగ్గర ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నట్లయితే వాటిని వేరే ప్రాంతాలకు మారుస్తాం.

– శివప్రసాద్ నాయుడు, ట్రాన్స్‌కో ఏఈ, రాప్తాడు

అంధవిశ్వాసాలపై చైతన్య బావుటా

సందర్భం: నేడు వేమన జయంతి

వేషభాలెరిగి కాషాయ వస్త్రముల్
కట్టగానె ముక్తి కలుగబోదు
తలలు బోడులైన తలపులు బోడులా
విశ్వదాభిరామ ! వినుర వేమ !

.. అంటూ ఆటవెలదినే తూటాలుగా మార్చి సనాతన ధర్మమంటూ మత మౌఢ్యాన్ని ప్రచారం చేసే వారిపై విరుచుకుపడిన మహాకవి వేమన.

మూఢనమ్మకాలపై చైతన్య బావుటా ఎగరేసిన అభ్యుదయ ప్రజాకవి వేమన పద్యం తెలియని తెలుగు వారు ఉండబోరన్నది లోకోక్తి. 1652–1780 మధ్య కాలంలో జీవించిన వేమన కవిగానే కాకుండా సంస్కరణాభిలాషిగా, కులాలను నిరసించిన మానవతామూర్తిగా, పరభాషా ఆధిపత్యాన్ని ప్రశ్నించిన చిరస్మరణీయుడిగా తెలుగువారి గుండెల్లో నిలిచిపోయారు. ఆదివారం వేమన జయంతి.

– అనంతపురం కల్చరల్:



యోగి వేమన విగ్రహం

అధికారికంగా నిర్వహించాలి



వేమన సాహిత్యానికి విస్తృత ప్రచారం చేయడానికి అనేక ఏళ్లగా ప్రయత్నిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో వేమన జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ ప్రభుత్వం కూడా అధికారికంగా ప్రకటించాలని కోరుతున్నాం. గత మూడేళ్లలో 300కు పైగా పాఠశాలల్లో చిన్నారులకు పద్యపఠన పోటీలు, వ్యాసరచనలు నిర్వహించి ప్రోత్సహిస్తూ వస్తున్నాం. చిన్నారుల్లో వేమన సాహిత్య పఠనం మరింత పెద్ద ఎత్తున సాగాలి.

– డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, వేమన ఫౌండేషన్ కార్యదర్శి

ఆత్మవిశ్వాసంతో జీవించాలి



బుక్స్ అందజేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం ఎడ్యుకేషన్: హెచ్‌ఐవీ బాధితులు, తలసీమియా వ్యాధిగ్రస్తులు ఏమాత్రం అధైర్యపడకుండా ఆత్మవిశ్వాసంతో జీవించాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సూచించారు. శనివారం స్థానిక ఐఎంఏ హాలులో హెచ్‌ఐవీ బాధిత విద్యార్థులు, తలసీమియా బాధిత విద్యార్థులకు అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్ సంస్థ ఆధ్వర్యంలో గైడ్స్, నోట్‌బుక్స్, జామెంట్రీ బాక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్, కిరాణా సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ.. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకోవాలని పిల్లలకు సూచించారు. ఐసీడీఎస్ పీడీ వనజ అక్కమ్మ మాట్లాడుతూ.. మిషన్ వాత్సల్య స్కీం ద్వారా హెచ్‌ఐవీ బాధిత పిల్లలకు నెలకు రూ.4 వేలు మంజూరు చేస్తున్నామన్నారు. అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధిత పిల్లలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. హెచ్‌ఐవీతో జీవిస్తున్న వ్యక్తులకు అన్ని శస్త్ర చికిత్సలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేలా చూస్తామన్నారు. తలసేమియా పిల్లలకు రక్తమార్పిడి, డేకేర్ సెంటర్లను స్థాపిస్తామన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డీపీఎం భాస్కర్ మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపిస్తే శిక్షార్హులన్నారు. తెలుగు నెట్‌వర్క్ ఆఫ్ పీపుల్ లివింగ్ విత్ హెచ్‌ఐవీ ఎయిడ్స్ కార్యదర్శి వీరాంజనేయులు మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ బాధితుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పాజిటివ్ నెట్‌వర్క్ స్థాపించామన్నారు. కార్యక్రమంలో చైతన్య కళాభారతి డైరెక్టర్ విజయ భాస్కర్, కో–ఆర్డినేటర్ వరలక్ష్మి, అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్ అధ్యక్షుడు టి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛత.. దినచర్యలో భాగమవ్వాలి



ఉద్యోగులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం అర్బన్: పరిసరాల పరిశుభ్రత కోసం కొంత సమయం కేటాయించడం మన దినచర్యలో భాగం కావాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో 'స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని డీఆర్‌ఓ ఎ.మలోలతో కలిసి ఆయన ప్రారంభించారు. అధికారులు, ఉద్యోగులతో 'స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ' చేయించారు. జేసీ మాట్లాడుతూ మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం మన ఇంటివద్ద, పనిచేసే ప్రదేశంలో ఉండేలా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇందు కోసం కొంత సమయాన్ని కేటాయించుకుని పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యాలయ ఆవరణం, విభాగాలు, సర్వే భూరికార్డులు, జిల్లా ఖజానా, జిల్లా సౌర సరఫరాల శాఖ కార్యాలయాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, విభాగాల సూపరింటెండెంట్లు వసంత లత, యుగేశ్వరిదేవి, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం పలు ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, పశుశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి, ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్, ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు, పట్టుశాఖ డీడీ డి.ఆంజనేయులు, మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణ చౌదరి, వ్యవసాయశాఖ ఏడీఏ ఎం.రవి, రూరల్ ఏఓ జే.శశికళ తదితరుల ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం కార్యాలయాల ఆవరణలో కలుపు మొక్కలు, పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తదితర వ్యర్థాలను శుభ్రం చేశారు. పరిసరాల శుభ్రతతో ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, పనితీరు మెరుగు పడుతుందని అధికారులు తెలిపారు.

ఆత్మకూరు: చెత్త రోడ్లపై వేయకుండా పంచాయతీ వాహనాలు వచ్చినప్పుడు అందులో వేయాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ సూచించారు. శనివారం మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా మండలంలోని 16 పంచాయతీల్లో అధికారులు పరిసరాలను శుభ్రం చేశారు. చెత్త, చెదారాన్ని అధికారులు తొలగించారు.

అనంతపురం సెంట్రల్: స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం రవాణాశాఖ కార్యాలయంలో ఉప రవాణా కమిషనర్ వీర్రాజు, ఆర్టీఓ సురేష్ నాయుడు పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలి

అనంతపురం టవర్‌క్లాక్: కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షురాలు పరంజ్యోతి అన్నారు. శనివారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. అతిథులుగా రాష్ట్ర కో–ఆర్డినేటర్ పూర్ణ చంద్రరావు, రిటైర్డ్ జిల్లా జడ్జి క్రిష్టప్ప, బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ పూర్ణచంద్ర రావు, రాష్ట్ర కన్వీనర్ రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో సీట్లు కేటాయించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో కులగణన నిర్వహించి స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. బీసీ కులగణన కోసం బీఎస్పీ పోరాటం చేస్తుందన్నారు. బీసీల పార్టీ అని చెప్పుకునే టీడీపీ.. వెంటనే కులగణన చేయాలని డిమాండ్ చేశారు. కులగణన కోసం బీసీలు పోరాటాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీరాములు, నాయకులు ఆదినారాయణ, గద్దల నాగభూషణం, రియాజ్, మసవల ఆంజనేయులు, షరిఫా, లీలావతి, ఇంధిరాదేవి, రాజు నాయక్, గోగుల ఆంజి, దాసగాని కుళ్ళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజల తరఫున పోరాడుదాం



పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి బొకే అందజేస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి



అనంత వెంకటరామిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు ప్రజల తరఫున పోరాడాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ శ్రేణులపై ఉందని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆలమూరు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నియమితులైన కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి శనివారం వేర్వేరుగా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. బొకే, గజమాలతో సన్మానించారు. తమకు జిల్లా కమిటీలో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి పాటుపడతామన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్గనైజింగ్ ఏ స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్‌పై నేషనల్ వెబినార్

అనంతపురం: పరిశ్రమకు, కళాశాల మధ్య అంతరం తగ్గేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ఏఐసీటీఈ, నేషనల్ కో–ఆర్డినేషన్ కమిటీ డాక్టర్ వాన్సన్ సింగ్ అన్నారు. ఆర్గనైజింగ్ ఏ స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్ అనే అంశంపై నేషనల్ వెబినార్ నిర్వహించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.ప్రశాంతి పాల్గొని ఆన్‌లైన్‌లో ప్రసంగించారు. బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించాలని కోరారు. ఏఐసీటీఈ 9 అంశాలతో కూడిన స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్‌ను మూడు వారాల పాటు నిర్వహించాలని సూచించారు.

వివాహిత అదృశ్యం



కటిక అఖిల

అనంతపురం: నగరంలోని సత్యదేవ నగర్‌కు చెందిన దూదేకుల షేక్షావలి భార్య కటిక అఖిల (26) తన మూడేళ్ల కుమారుడితో కలిసి ఈనెల 13న ఉదయం 10 గంటలకు అదృశ్యమైంది. ఆచూకీ తెలిసిన వారు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కే.సాయినాథ్ తెలిపారు.

21న 'పది' విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈనెల 21న రిపబ్లిక్ డేను పురస్కరించుకుని పదో తరగతి విద్యార్థులకు వివిధ అంశాలపై సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 26న బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. దేశభక్తి గేయాలపై పాటల పోటీలు, ఆధునిక భారతదేశంలో శాస్త్ర సాంకేతిక అభివృద్ధి అనే అంశంపై వ్యాసరచన పోటీలు, వాతావరణ కాలుష్యంపై చిత్రలేఖనం పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 88868 85173 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు 10కె రన్

అనంతపురం: నగరంలో ఆదివారం 10కె రన్, 5కే వాక్ నిర్వహిస్తున్నారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్, అల్ట్రా రన్నర్ జుయన్ మానుయల్ వైరా, జిల్లా ఎస్పీ పి. జగదీష్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఉదయం ఆరు గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కార్యక్రమం ప్రారంభమై, ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్ వద్ద ముగియనుంది.

యువకుడి అదృశ్యం

అనంతపురం: నగరంలోని కమలానగర్‌లో ప్లాస్టిక్ షాపులో సహాయకుడిగా పని చేస్తున్న మూడ్ సింగ్ (28) అదృశ్యమైనట్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఈనెల 14వ తేదీ భోజనానికి వెళ్లినప్పటి నుంచి షాపుకు రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ దొరకలేదని యజమాని తెలిపారు.

నేడు పెద్దన్న స్థూపం ఆవిష్కరణ

అనంతపురం అర్బన్: సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.పెద్దన్న స్థూపం ఆవిష్కరణ, వర్ధంతి సభను ఆదివారం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రజకనగర్‌లో ఉదయం 11 గంటలను జరగనున్న కార్యక్రమాల్లో పార్టీ కేంద్ర నాయకుడు గుర్రం విజయ కుమార్ స్థూపాన్ని ఆవిష్కరిస్తారన్నారు.

ఎస్పీతో భేటీ



ఎస్పీ జగదీష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

అనంతపురం: తాడిపత్రి ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రోహిత్ కుమార్ చౌదరి శనివారం ఎస్పీ పి.జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రోహిత్ కుమార్ చౌదరి రాష్ట్ర గ్రేహౌండ్స్ విభాగం అసాల్ట్ కమాండర్‌గా పనిచేస్తుండగా, తాడిపత్రి ఏఎస్పీగా బదిలీ చేశారు.

నివాళి



త్రిలోక్ చంద్ జైన్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని మహాలక్ష్మి టెక్స్‌టైల్స్ అధినేత త్రిలోక్ చంద్ జైన్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు అనంత చంద్రారెడ్డి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. త్రిలోక్‌చంద్ జైన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సాకే చంద్ర, సోమశేఖర్ రెడ్డి, జగదీష్, చింతకుంట మధు, రాధాకృష్ణ, శివారెడ్డి పాల్గొన్నారు.

అలరించిన త్యాగయ్య కృతులు



త్యాగరాజ కృతులను ఆలపిస్తున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: సంగీత వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలు శనివారం వేర్వేరు చోట్ల ఘనంగా జరిగాయి. తపోవనంలోని శ్రీక్షేత్రంలో శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంగీత కచేరీలో మాజీ ప్రభుత్వ సలహాదారుడు (ఎండోమెంట్) జ్వాలాపురం శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని సంగీత విద్వాంసులను సత్కరించారు. అలాగే మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో విజయ వాణి సంగీత కళానిలయం మొదలి మురళీకృష్ణ నేతృత్వంలో పంచరత్నగాన సేవలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఏకైక త్యాగరాజ మందిరంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం సంగీత కచేరి జరిగింది. చెన్నైకి చెందిన మధుమతి, సుమేధ, కర్నాటక శాస్త్రీయ సంగీతంతో దేవగాంధారి రాగాలతో అలరించారు. వయోలిన్‌పై దివ్య, మృదంగంపై మొదలి కృష్ణసాయి, ఘటంపై శ్రీనిధి కౌండిన్య వాయిద్య సంగీతం అందరినీ ఆకట్టుకుంది.

రోడ్డు భద్రతపై అవగాహన తప్పనిసరి



యువకులకు మై భారత్ టీ షర్టులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నిర్లక్ష్యం ఎంతో మంది ప్రాణాలను హరిస్తోంది. ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా రవాణా డిప్యూటీ కమిషనర్ ఎం.వీర్రాజు అన్నారు. శనివారం నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని ఎన్‌వైకే వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడు చిహ్నాలు, గుర్తులు, తృతీయ పార్టీ ఇన్సూరెన్సు ప్రాధాన్యత, ప్రమాదాలకు కారణాలు, మంచి డ్రైవింగ్ అలవాట్లు వంటి విషయాలపై సమగ్రంగా వివరించారు. అనంతరం రోడ్డు భద్రతపై యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. మై భారత్ టీ షర్టులు, టోపీలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌వైకే డీడీఓ శ్రీనివాసులు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రఘు ప్రసాద్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, వేణుగోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.